క్లుప్తంగా

నేడు మాదాపూర్‌లో గ్రంథాలయం ప్రారంభం

కందుకూరు: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మాదాపూర్‌లో పైలెట్ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేస్తున్న పౌర పఠన కేంద్రాన్ని ప్రారంభించడానికి విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి గురువారం సాయంత్రం రానున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యాధికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా గురువారం 11కేవీ పసుమాముల ఫీడర్ పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

6 నుంచి క్రీడాపోటీలు

కందుకూరు: నెహ్రూ యువ కేంద్రం రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో కందుకూరు, మహేశ్వరం మండలాల పరిధిలోని యువతీయువకులకు ఈనెల 6 నుంచి నేదునూరు మోడల్ స్కూల్‌లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎన్‌వైకే మహేశ్వరం బ్లాక్ ఇన్‌చార్జి ముద్దంగుల శివకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15–29 సంవత్సరాల వయస్సు గల యువతీయువకులు అర్హులన్నారు. యువకులకు.. వాలీబాల్, కబడ్డీ, టగ్‌ఆఫ్‌వార్, యువతులకు.. త్రోబాల్, కబడ్డీ, టగ్‌ఆఫ్‌వార్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఏ గ్రామానికి సంబంధించిన క్రీడాకారులు ఆ గ్రామానికే ఆడాలన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారన్నారు. ఈనెల 5వ తేదీ సాయంత్రంలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వివరాలకు సెల్ 99519 29031, 84658 72204, 88855 03811, 99486 18121 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి

కందుకూరు: మండల పరిధిలోని సాయిరెడ్డి గూడకు చెందిన తల్లోజు భీష్మాచారి ఇటీవల ప్రమాదవశాత్తు జారిపడటంతో కాళ్లు,చేతులు చచ్చుపడ్డాయి. అత్యవసరంగా ఆపరేషన్ అవసరమైంది. దీంతో స్థానిక నాయకుడు వెంకట్రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులు మంత్రి సబితారెడ్డి సహకారంతో సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో రూ.2.50 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఆ మంజూరు పత్రం బుధవారం మంత్రి సబితారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు.

రావిర్యాల చెరువును సందర్శించిన అధికారులు

తుక్కుగూడ: హైకోర్టు ఆదేశాల మేరకు బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల చెరువును ఇరిగేషన్, రెవెన్యూ, హెచ్‌ఎండీఏ, మున్సిపల్ అధికారులు సందర్శించారు. చెరువు భౌగోళిక సరిహద్దులను పరిశీలించారు. అధికారులు మాట్లాడుతూ.. చెరువు బఫర్‌జోన్ ఎఫ్‌టీఎల్‌ను త్వరలోనే విడిస్తామన్నారు. కార్యక్రమంలో కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్, ఇరిగేషన్ డీఈఈ జగదీశ్,, ఏఈ సుప్రియ, తహసీల్దార్ మహ్మద్‌అలీ, కమిషనర్ వెంకట్రామ్, హెచ్‌ఎండీఏ పాల్గొన్నారు.

వైభవంగా పడిపూజ



మహాపడిపూజలో పాల్గొన్న భక్తులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీ అయ్యప్ప దేవాలయంలో మహాపడి పూజ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప విగ్రహానికి పలు రకాల అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అయ్యప్ప మాలధారులకు గురుస్వాములు ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శబరికి యాత్రకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు శ్రీనివాస్‌గౌడ్, ప్రభాకర్‌గౌడ్, శంకరయ్య, పూజారులు ప్రవీణ్‌శర్మ, హేమంత్‌గౌడ్, బాలజీ, మహేందర్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో వివిధ కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమాటా కిలో రూ. 11, వంకాయ 35, బెండ 47, పచ్చిమిర్చి 43, కాకర 40, బీర 45, కాలీఫ్లవర్ 15, క్యాబేజీ 11, క్యారెట్ 18, దొండ 45, ఆలు 35, ఉల్లి 29, గోకర 35, దోస 25, సొర 13, పొట్ల 15, అరటి 9, చిక్కుడు 50, అర్వి 50, చిలగడదుంప 23, బీట్‌రూట్ 18, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 35, కాప్సికమ్ 45 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు గురువారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

గ్రామసింహాల స్వైరవిహారం

గుంపులుగా బెంబేలెత్తిస్తున్న శునకాలు



రావిర్యాల చౌరస్తాలో కుక్కల సంచారం

తుక్కుగూడ: వీధుల్లో గ్రామ సింహాలు స్వైర విహారం చేస్తున్నాయి. పదుల సంఖ్యలో గుంపులు గుంపులుగా తిరుగుతూ పురప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. కరవకపోయినా.. గుర్రుమంటూ పైనపడి కరిచేంతా పనిచేస్తున్నాయంటూ స్థానికులు వాపోతున్నారు. రావిర్యాల, తుక్కుగూడ, మంఖాల్, సర్దార్‌నగర్, దేవేందర్‌నగర్‌కాలనీ, ఇమామ్‌గూడ ఇలా ఏ గ్రామంలో చూసినా.. గల్లిగల్లిలో కుక్కల బెడదే అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వాహనదారుల బెంబేలు

మున్సిపాలిటీ పరిధిలో ఈ–సిటీ, మంఖాల్ పారిశ్రామికవాడ, హార్డువేరు పార్కు, తదితర పరిశ్రమలు ఉండటంతో ఉపాధి కోసం దినచర్యగా ఎంతోమంది వస్తుంటారు. ఇక్కడ విధులు ముగించుకొని రాత్రి, తెల్లవారుజామున ఇళ్లకు వెళ్లేవారి వాహనాల లైటు వెలుతురుకు పడుకున్న శునకాలు ఒక్కసారి పైకి లేవడంతో వాహనదారులు తడబాటుకు లోనవుతున్నారు. వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని, పాదచారులపై కూడా దాడులకు తెగబడుతున్నాయని పరిసరప్రాంత ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కల దాడిలో చాలామంది గాయపడ్డారని, పలుమార్లు సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. వీధి కుక్కల బారినుంచి కాపాడాలంటూ కోరుతున్నారు.

మీర్‌పేట పోలీసులకు సత్కారం

మీర్‌పేట: శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ఉత్తమ పనితీరుకుగాను రాష్ట్రంలో మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు 18వ స్థానం దక్కడం హర్షణీయమని మీర్‌పేట కార్పొరేషన్ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షులు దాసరి బాబు తెలిపారు. బుధవారం సంఘం నాయకులు మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ ఎం.మహేందర్‌రెడ్డి, ఎస్‌ఐలు నర్సింహనాయక్, ఉదయ్‌భాస్కర్, బద్యానాయక్, సత్యనారాయణ, గోవిందస్వామి, రవిలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దాసరి అరవింద్, ప్రభాకర్, నర్సింహ, జంగ్లి, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.



సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్‌ఐలను సత్కరిస్తున్న అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు

అవేర్ సంస్థ సేవలు అభినందనీయం

ఎంపీపీ రఘుమారెడ్డి



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మహేశ్వరం: గ్రామీణా ప్రాంత పేదలకు అవేర్ సంస్థ వారు ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆకన్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో అవేర్ సంస్థ ఆధ్వర్యంలో కామినేని ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆనారోగ్య సమస్యలున్నవారు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకొని వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ప్రతి రోజు వాకింగ్, యోగా, ధ్యానం, వ్యాయమం చేస్తే ఆరోగ్యంగా ఉండడడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. గ్రామాలు, గిరిజన తండాలు, అనుబంధ గ్రామాల్లో అవేర్ సంస్థ వారు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయడం పట్ల అభినందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో అవేర్‌సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఆకన్‌పల్లి గ్రామానికి ఉచిత వైద్యం, రోగులకు మందులతో పాటు బోర్ మోటర్‌ను అవేర్ సంస్థ వారు అందజేయడం అభినందనీయమన్నారు. అంతకు ముందు వైద్య శిబిరంలో 169 మందికి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆకన్‌పల్లి సర్పంచ్ ముక్కెర యాదయ్య, ఉప సర్పంచ్ గురు ప్రీత్, అవేర్ సంస్థ మేనేజర్ వరుణ్, కార్యానిర్వాహక అధికారి వెంకన్న, పలువురు వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ.. కేసుల నమోదు



వాహనాల తనిఖీలు చేస్తున్న పోలీసులు

పహాడీషరీఫ్: రాచకొండ నూతన కమిషనర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన దేవేంద్రసింగ్ చౌహాన్ ఆదేశాలతో బాలాపూర్ పోలీసులు బుధవారం సాయంత్రం వాహనాల తనిఖీలకు శ్రీకారం చుట్టారు. ఇన్‌స్పెక్టర్ బి.భాస్కర్ ఆధ్వర్యంలో షాహీన్‌నగర్ ప్రధాన రహదారిపై గల జేజీఆర్ గార్డెన్ వద్ద వాహనాలను నిలిపి లైసెన్స్, రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలించారు. నిబంధనలు పాటించని వాహనాలకు ఛలానాలు విధించడంతో పాటు నంబర్ ప్లేట్లు లేని వాహనాలకు ఎంవీఐ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు.

10 వరకు ప్రవచన సప్తాహం

మీర్‌పేట: వనస్థలిపురం భక్త సమాజం, ధర్మాచార్య, హిందూ ధర్మప్రచార పరిషత్, తిరుమల తిరుపతి దేవస్థానం వారి సంయుక్త ఆధ్వర్యంలో మీర్‌పేట కార్పొరేషన్ పరిధి ప్రశాంతిహిల్స్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ప్రవచన సప్తాహంను ఈ నెల 10వ తేదీ వరకు నిర్వహించనున్నారు. 5వ తేదీన గాజుల సత్యనారాయణమూర్తిచే సుందరాకాండ, 6న శ్రీరాములుచే పార్వతీ కల్యాణం, 7న నారుమంచి శ్రీరామచంద్రమూర్తిచే విరాటపర్వం, 8న వద్దిరాజు జనార్ధనరావుచే గజేంద్ర మోక్షం, 9న పండితారాధ్యుల వీరరాజుచే అంబరీషోపాఖ్యానం, 10వ తేదీన కుప్పా శ్రీనివాస శాస్త్రిచే రుక్మిణీ కల్యాణం ప్రవచన కార్యక్రమం ఉంటుందని, ప్రతిరోజు సాయంత్రం 6.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు కొనసాగుతోందని నిర్వాహకులు ధర్మాచార్య ఎ రాములు, వనస్థలిపురం భక్త సమాజం అధ్యక్షులు సీహెచ్.వీ.ఆర్.కే. మూర్తి తెలిపారు.

వివాహిత అదృశ్యం

హస్తినాపురం: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వివాహిత అదృశ్యమైన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఇంజాపూర్ గ్రామానికి చెందిన మల్లెల జగన్‌తో అనిత రెండవ వివాహం గత నెల 14 జరిగింది. జగన్ ఇంటికి వచ్చిన అనిత(33) ఈ నెల ఒకటో తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో భర్త జగన్ అనిత ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల దగ్గర వెతికినా ఫలితం లేదు. దీంతో వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ధాత్రిదేవికి సత్కారం

ఆమనగల్లు: జిల్లా సహకార శాఖ అధికారి ధాత్రిదేవిని.. డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం సింగిల్‌విండోలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ ఉద్యోగులుగా నియమించుటకు కసరత్తు ప్రారంభించిన నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా సహకార శాఖ కార్యాలయంలో అధికారి ధాత్రిదేవిని గంపవెంకటేశ్ గుప్త మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు సింగిల్‌విండో సీఈఓ దేవేందర్ ఉన్నారు.

ప్రభుత్వ పనితీరును ఎండగడదాం

బీజేపీ నేత అరుణ్‌కుమార్

ఇబ్రహీంపట్నం: బీజేపీ బలోపేతానికి కృషిచేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నంలో బుధవారం మండల బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్ ప్రభుత్వ పనితీరును ప్రజల్లో ఎండగట్టాలన్నారు. జాతీయ పార్టీ అధ్యక్షులు నడ్డా ఈనెల 7న వర్చువల్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నాడని, బొంగ్లూర్ కళ్లెం జంగారెడ్డి గార్డెన్‌కు నేతలు హాజరై ఈ లైవ్ ప్రోగ్రాంలో పాల్గొనాలని కోరారు. పార్టీ భవిష్యత్తుపై దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆపార్టీ నాయకులు శ్రీశైలం, దండెం శ్రీశైలం, రమణారెడ్డి పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటా..

ఉపసర్పంచ్ జాటోత్ రవినాయక్



విరాళం అందజేసిన ఉప సర్పంచ్ జే.రవినాయక్

మహేశ్వరం: జాండమల్రి తండాల్లో కొలువుదీరిన శ్రీఅంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, హర్షగూడ ఉప సర్పంచ్ జాటోత్ రవినాయక్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని హర్షగూడ గ్రామానికి అనుబంధంగా ఉన్న జాండమల్రి తండాల్లో కొలువుదీరిన శ్రీఅంజనేయ స్వామి ఆలయ ఆవరణలో సిమెంట్ కాంక్రీట్ నిర్మాణం చేయుటకు రూ.10,999 లను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆలయాల నిర్మాణానికి తనవంతుగా సహాయం అందించి అభివృద్ధే లక్ష్యంగా తాను నిరంతరం పని చేస్తామన్నారు. గ్రామంలో ప్రతి వార్డుకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాలతో పాటు తాగునీటి సౌకర్యాలను ఏర్పాటు చేస్తామన్నారు. విద్యాశాఖ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి సహకారంతో హర్షగూడ గ్రామానికి మరిన్ని నిధులు తీసుకొచ్చి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతామన్నారు. మంగళవారం రాత్రి కడ్తాల్ మండలం టక్రాజ్‌గూడ గ్రామానికి చెందిన జగన్‌నాయక్ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో పాటు వారి కుమారుడు అఖిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతుండంతో వైద్య ఖర్చులకు వారి కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సహాయం రవినాయక్ అందజేశారు. ఆపదలో ఉన్న వారిని అదుకొని తనవంతుగా సాయం అందజేశామన్నారు. భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవకార్యక్రమాలను నిర్వర్తిస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు సరోజనవీన్, జరుపుల రాజు నాయక్, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు యాదయ్య గౌడ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఇస్లావత్ ఉమ్లా నాయక్, ఆలయ పెద్ద తారాసింగ్ భావోజీ, నాయకులు రమేష్ రాథోడ్,రమేష్, స్వామి, భాస్కర్, జగన్, పలువురు పాల్గొన్నారు.

సరూర్‌నగర్ డివిజన్ అభివృద్ధికి ఆమడ దూరం

సోషల్ మీడియా షోలకే పరిమితమైన కార్పొరేటర్



మొగిళ్ల మల్లేష్

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్‌గా గెలిచి దాదాపు రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఆకుల శ్రీవాణి చేసిన అభివృద్ధి శూన్యమని బీఆర్‌ఎస్ డివిజన్ సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి మొగిళ్ల మల్లేష్ విమర్శించారు. బుధవారం కార్పొరేటర్ శ్రీవాణి డివిజన్‌లో 10వేల మందికి ఉత్తరాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలుసుకున్న మల్లేష్ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. కార్పొరేటర్ ఉత్తరాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. బీజేపీ నుంచి కార్పొరేటర్‌గా గెలిచి దాదాపు రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు డివిజన్ అభివృద్ధిని పట్టించుకోకుండా కేవలం సోషల్ మీడియా వేదికగా షో చేసుకుంటూ సమయాన్ని వృథా చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం గానీ, స్థానిక ఎమ్మెల్యే మంత్రి సబితా ఇంద్రారెడ్డి గానీ ఏమీ నిధులు ఇవ్వడం లేదని ఆరోపణలు చేస్తూ తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు బుధవారం కొత్త నాటకానికి తెరలేపారన్నారు. ఇంటింటికి ఉత్తరాలను పంచే నీచమైన కార్యక్రమం చేపట్టిన కార్పొరేటర్‌ను నమ్మే పరిస్థితిలో డివిజన్ ప్రజలు లేరన్నారు. కార్పొరేటర్ చేష్టలను ప్రజలు గమనిస్తున్నారని మల్లేష్ వివరించారు. రాబోయే కాలంలోనైనా బుద్ధి మారి డివిజన్ అభివృద్ధికి పాటుపడతారని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ

మీర్‌పేట: యువత సైబర్ మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని మీర్‌పేట పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ సత్యనారాయణ సూచించారు. సీఐ మహేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం హస్తినాపురంలోని అనన్య డిగ్రీ కళాశాలలో రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సత్యనారాయణ మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం ఇవ్వొద్దని, ఎక్కడైనా సమాచారం ఇవ్వాల్సి వస్తే జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఫేక్ కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. తక్షణ రుణయాప్‌లు, ఓఎల్‌ఎక్స్ మోసాలు, పిష్పింగ్ లింక్‌లు, స్క్రీన్ షేరింగ్‌యాప్‌లు, క్యూఆర్ కోడ్ మోసాలపై విద్యార్థులకు వివరించడంతో పాటు సైబర్ మోసాల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు.

ప్రజావసరాలకు అనుగుణంగా వసతులు

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, నూతన కాలనీల ఆవిర్భావం కారణంగా పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మెరుగైన వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఖాద్రీకాలనీలో నెలకొన్న సమస్యలపై స్థానికులు హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్‌తో కలిసి బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సుధీర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. తాగునీటి నల్లా కనెక్షన్లను మంజూరు చేశారని, కాలనీలో పేద, మధ్య తరగతి కుటుంబాలు అధికంగా ఉంటున్నారని వారికి నీటి బిల్లులు రాకుండా చూడాలని కార్పొరేటర్ కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ... జలమండలి అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు జమీర్, సయ్యద్ అబ్బాస్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల చోరీ: ఇద్దరి అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకులతో నిందితులు

హస్తినాపురం: బైకులను దొంగిలించి తప్పించుకు తిరుగుతున్న ఇద్దరిని వనస్థలిపురం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేవరపల్లి మండలం రావుల పాలెం గ్రామానికి చెందిన చీకట్ల సతీష్(32) ప్లంబర్‌గా పనిచేస్తూ జీడిమెట్ల ప్రాంతంలో నివసిస్తున్నాడు. మహబూబ్‌నగర్ జిల్లా తాడూర్ మండలం పోల్మూర్ గ్రామానికి చెందిన దేశాని సంజీవరెడ్డి అలియాస్ సంజీవ(38) కారు డ్రైవర్‌గా పని చేస్తూ వనస్థలిపురంలోని క్రిస్టియన్ కాలనీలో ఉంటున్నాడు. వీరు తక్కువ సమయంలో డబ్బులు సంపాదించాలనే అత్యాశతో చోరీలు చేయాలని నిర్ణయించికున్నారు. ఈ క్రమంలో పార్కు చేసిన బైకులను దొంగిలించారు. వనస్థలిపురం పరిసర ప్రాంతాలలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పెట్రోలింగ్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. రెండు బైకులను తాము దొంగిలించినట్లు అంగీకరించారని పోలీసులు తెలిపారు. ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి రెండు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వివరించారు.

అత్తాపూర్ డివిజన్ అభివృద్ధే లక్ష్యం



తాగునీటి పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మొండ్ర సంగీతాగౌరీశంకర్

రాజేంద్రనగర్: ప్రతి ఇంటికీ తాగునీటిని అందించేందుకు కృషి చేస్తున్నట్లు అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మొండ్ర సంగీతాగౌరీశంకర్ అన్నారు. సిక్‌చౌనీ గురుద్వారా, మారుతీనగర్‌లలో తాగునీటి పైపులైన్‌లకు బుధవారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో తాగునీటి పైపులైన్ వ్యవస్థ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులతో చర్చించి కొత్త పైపులైన్‌ను వేసేందుకు తగిన చర్యలను ప్రారంభించామన్నారు. డివిజన్ పరిధిలోని సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. రంగారెడ్డి అర్బన్ జిల్లా కార్యదర్శి మొండ్ర కొమురయ్య, రాచూరి రాజశేఖర్, వెంకట్‌రెడ్డి, రాజు, గురుప్రీత్‌సింగ్, విజయ్, సోనుసింగ్, జలమండలి ఏఈ వినాయక్, లైన్‌మెన్ జగదీష్, భూషణం తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పైప్‌లైన్ల నిర్మాణం

- తాగునీటి పైప్‌లైన్ నిర్మాణానికి రూ. 4 కోట్ల మంజూరు
- ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: నియోజకవర్గంలో పలు కాలనీల్లో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణానికి రూ. 4 కోట్లు మంజూరైనట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. పైప్‌లైన్‌ల నిర్మాణానికి తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం తన కార్యాలయంలో వాటర్‌వర్క్స్ జీఎంలు బలరాంరాజు, వినోద్, ఎస్‌సీపీ ప్రతినిధి పూర్ణచందర్‌రావుతో సుధీర్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కొన్ని నెలలుగా వాటర్ వర్క్స్ ఎండీ దానకిషోర్‌తో నియోజకవర్గంలో పలు కాలనీల ప్రజల సంక్షేమ సంఘలతో మంచి నీటి పైప్‌లైన్‌ల కోసం సమావేశం ఏర్పాటు చేయించామని తెలిపారు. ఎక్కడెక్కడ పైప్‌లైన్‌లు వేయాలో మాస్టర్ ప్లాన్‌ను ప్రణాళికాబద్ధంగా రూపొందించాలని అధికారులకు సూచించారు. శివారులోని ప్రతి కాలనీకి మంచి నీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో డీజీఎం సరిత, శ్రీను రమ్య భారతి తదితరులు పాల్గొన్నారు.

బాలిక సాధికారతపై విద్యార్థినులకు అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఓ అనిత

ఆమనగల్లు: బాలికలు ఉన్నత విద్య యొక్క ప్రాధాన్యతను గుర్తించి విద్యావంతులుగా ఎదగాలని జీసీఈసీ అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ అనిత సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు బాలికా సాధికారత, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లడుతూ.. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవన్‌నాయక్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్‌నాయక్



వినతిపత్రం అందిస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

ఆమనగల్లు: నాదర్‌గుల్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో వారం రోజుల క్రితం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఆమనగల్లు మున్సిపాలిటీ నుచ్చుగుట్టతండాకు చెందిన విద్యార్థి జీవన్ నాయక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్‌నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గన్యానాయక్, జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి కృష్ణనాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమశాఖ గురుకులాల అదనపు కార్యదర్శి సర్వేశ్వర్‌రెడ్డిని బుధవారం బాధిత కుటుంబసభ్యులతో కలిసి వారు కలిశారు. జీవన్‌నాయక్ కుటుంబానికి ఆర్థికసాయం అందించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, నాదర్‌గుల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు వినతిపత్రంలో కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా న్యాయం చేస్తామని సర్వేశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.